పిల్లలకు జలగండం..!

- ఎండల నుంచి ఉపశమనం కోసం బావులు, నీటికుంటల్లో ఈతకు వెళ్తున్న చిన్నారులు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు
- పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి



బావిలో ఈత కొడుతున్న యువకులు

సంజామల: వేసవిలో ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం పిల్లలు, యువత చెరువులు, బావులు, నీటి కుంటల్లో సరదాగా ఈత కొట్టడానికి వెళుతుంటారు. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వేసవి సెలవులు రావడంతో విద్యార్థులకు ఈతకు పోవాలనే ఆసక్తి ఉంటుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రోజు యువకులు చెరువులు, బావులు, నీటి కుంటల వద్ద ఈత కొడుతూ చిల్ అవుతున్నారు. అయితే ఇవే వారి పాలిట మృత్యు గండాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఈత రాని పిల్లలు బలిఅవుతున్నారు. పెద్దల పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే తల్లిదండ్రులకు తీరని శోకం మిగలక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు సరదాగా ఈతకు వెళ్తామంటే తల్లి తండ్రులు సరే అని వదిలేయకుండా పిల్లల వెంట వెళ్లాలి. ఈత వచ్చిన వారిని కనిపెట్టుకుని ఉండి ఈత ముగిసిన తర్వాత ఇంటికి తీసుకెళ్లాలి. ఈత రాని పిల్లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి. దగ్గరుండి ఈత నేర్పించాలి. పిల్లలను తెలిసిన వారితో పంపకుండా వెంట తీసుకెళ్లడం ఉత్తమం.

పర్యవేక్షణ తప్పనిసరి

ఈతకు వెళ్లే సమయంలో ఈత రానివారు చాలా జాగ్రతగా ఉండాలి. ఈత నేర్చుకునే సమయంలో మునిగిపోకుండా మునగ, లబ్బర్ కట్టెలు, ఖాళీ డబ్బాలు, గాలి ట్యూబ్‌లు, థర్మాకోల్ షీట్స్ కట్టుకోవాలి. ఈత రానివారి నడుముకు తాడు కట్టి ఈత నేర్పించుకోవాలి. ఈతరాని వారు ఈత వచ్చేవారి పర్యవేక్షణలోనే ఉండాలి. ఈత వచ్చిన వారు ఒకరి మీద ఒకరు దూకకూడదు. బావుల్లో కంప చెట్లు, రాళ్లు, బురద ఎక్కువగా ఉన్నప్పుడు ఆ బావిలో ఈతకు వెళ్లకుంటే మంచిది.

ఒంటరిగా ఈతకు పంపొద్దు



వేసవి కాలంలో పిల్లలకు ఈత సరదా ఎక్కువగా ఉంటుంది. అయితే పిల్లలను ఒంటరిగా ఈతకు పంపకూడదు. ముఖ్యంగా ఈత రాని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లలు ఈతకు వెళ్తున్నామని చేప్తే వారి వెంట పెద్దలు వెళ్లాలి. దగ్గరుండి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఈత నేర్పించాలి. వేసవి సెలవులు ముగిసే వరకు పిల్లల కదలికపై ఓ కన్ను ఉంచాలి. చిన్న నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకునే ప్రమాదం ఉంది.

–రమణయ్య,ఎస్ఐ సంజామల

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తల్లితండ్రుల సమక్షంలో ఈత కొట్టడం మంచిది.
- ఈత కొట్టే సమయంలో శరీర నిర్మాణానికి అనువైన దుస్తులు ధరించాలి.
- తల వెంట్రుకలు తడవకుండా మాస్క్ లాంటిది ధరించాలి.
- ముఖాన్ని పైకి ఉంచి ఈదాలి. ఊపిరి పీల్చుకునేటప్పుడు జాగ్రతగా ఉండాలి.
- బావి, చెరువులోకి దూకే సమయంలో కాళ్లు ముందుగా నీళ్లను తాకేలా చూసుకోవాలి. తల కిందుగా దూకకపోవడం ఉత్తమం.
- బావిలో బండరాళ్లు, చెరువుల్లో ఎండిన కొమ్మలు ఉంటాయి.. అలాంటి వాటిలో లోతుగా ఈత కొట్టకూడదు.
- అరగంట కంటే ఎక్కువసేపు ఈత కొట్టొద్దు.
- బావిలో దూకే సమయంలో ఒకరి మీద ఒకరు దూకరాదు.
- బావి, చెరువులో దూకినప్పుడు ఎక్కువ సేపు నీళ్లలో మునిగి ఉండరాదు. అలా చేయడం ద్వారా ఊపిరి ఆడకపోవడంతో మృతి చెందే అవకాశాలు ఉన్నాయి.

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: స్థానిక గాంధీనగర్‌లో వెలసిన సత్యనారాయణస్వామి ఆలయంలో వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. వేద పండితులు చాణక్య, కృష్ణస్వామి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



బాబా దర్శనానికి వచ్చిన భక్తులు

ప్యాపిలి: స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. వార్షికోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయానికి మకర తోరణం అందజేత



పూజల్లో పాల్గొన్న బాలదస్తగిరి కుటుంబ సభ్యులు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి ఆలయానికి ఇటిక్యాలకు చెందిన బాల దస్తగిరి కుటుంబ సభ్యులు గురువారం పంచలోహ మకర తోరణాన్ని అందజేశారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి మకరతోరణాన్ని అలంకరించారు. దాత కుటుంబ సభ్యులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా బాధ్యతలు



శ్యామలరాజు

డోన్: మున్సిపల్ రెవెన్యూ అధికారిగా శ్యామలరాజు గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న వెంకటరెడ్డి నంద్యాల మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్యామల రాజును ప్రభుత్వం నియమించింది.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. అవుకు మండలం శివవరంకు చెందిన నారాయణరెడ్డి కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇంటికి నిప్పు.. వ్యక్తిపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి మద్దయ్య ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున గూటం సాయి అనే వ్యక్తి ఇంటికి పెట్రోలు పోసి నిప్పు పెట్టాడు. ఇంట్లో నిద్రిస్తున్న వారు అప్రమత్తమై బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. తమను చూసి గూటం సాయి పారిపోయాడని గజ్జి మద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తి నుంచి 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా పాండురంగడి కోనేటి తిరునాల



పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ద్వాదశ కుంభహారతి, పేట, కోనేటి తిరునాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, విష్ణుసహస్ర నామస్తోత్ర పారాయణం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కోనేటి పుష్కరతీర్థంతో స్వామి వారికి పుష్కరపూజ చేశారు. వివిధ కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పాండురంగడి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు.

బాల్యాన్ని బలి చేయొద్దు

బేతంచెర్ల: బాలికలకు చిన్న వయస్సులోనే పెళ్లి చేసి వారి జీవితాలను బలి చేయవద్దని.. బాగా చదివించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, తహశీల్దార్ ప్రకాశ్‌బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అడ్డుకట్ట వేసేందుకు ఆయా సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, ఉమన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

మైనింగ్ పనుల నిలిపివేత

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిలో అక్రమంగా చేస్తున్న మైనింగ్ పనులను గ్రూపు ఆలయాల ఈఓ బ్రహ్మానందరెడ్డి, అర్చకుడు భాస్కరయ్య గురువారం అడ్డుకున్నారు. గ్రామ సర్వే నంబర్ 308లో సుమారు నాలుగు ఎకరాల మాన్యం భూమిలో విలువైన నాపరాయి ఉంది. ఈ భూమిలో కూటమి పార్టీకి చెందిన కొందరు నాయకులు యథేచ్ఛగా మైనింగ్‌కు పాల్పడుతున్నారు. ఈఓ వస్తున్నారని తెలుసుకున్న మైనింగ్ మాఫియా అక్కడి నుంచి జారుకుంది. అక్కడ ఉన్న కూలీలను ఈఓ హెచ్చరించి పంపివేశారు.

నేటి నుంచి చెన్నకేశవుడి ఉత్సవాలు

అవుకు: పట్టణంలోని కోటలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా నిత్యం పూజలందుకుంటున్నాడు. ఏటా వైశాఖ మాసంలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతి రోజు ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రాజవంశీయుల ఇంటి వద్దకు అక్కడి నుంచి తేరువీధి, రాజావీధి మీదుగా మండపం వీధి వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. మే 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. శుక్రవారం రాత్రి సంకల్పం, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశస్థాపనాదులు జరుగుతాయి. 10వ తేదీ వైశాఖ శుద్ధ త్రయోదశి ఉదయం చెన్నకేశవస్వామి తిరుకల్యాణం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి ఉత్సవమూర్తులను హనుమంతు వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. 11న రాత్రి సింహవాహనం, 12న శేషవాహనం, 13న గరుడవాహనం, 14న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 15,16వ తేదీల్లో రథోత్సవం జరుగుతుంది. 17న తీర్థవాది, ధ్వజావరోహణం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఐపీఎల్ బెట్టింగ్ మోజులో యువత

కొలిమిగుండ్ల: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి యువత ఆర్థికంగా నష్టపోతున్నారు. యువత, విద్యార్థులు, కార్మికులు బెట్టింగ్ మాయలో చిక్కుకుంటున్నారు. కొందరు బెట్టింగ్ కోసం అప్పులు చేస్తున్నారు. ప్రతి రోజు మ్యాచ్ ప్రారంభం కాగానే ఏ జట్టు గెలుస్తుందనే వాటిపై వేలల్లో బెట్టింగ్ ఆడుతున్నారు. లోడింగ్ కార్మికులు కష్టపడి పనిచేసిన సొమ్మును వీటిపై పెడుతూ నష్టపోతున్నారు. మండలంలో రోజు కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగానే బెట్టింగ్ జరుగుతుందని ప్రచారం జరుగుతోంది. సాయంత్రం అయితే చాలు యువత గుంపులుగా చేరడం లేదా సెల్‌ఫోన్లలో చర్చించుకుని ఏ జట్టు గెలుస్తుందని మాట్లాడుకొని బెట్టింగ్ ఆడుతున్నారు. చాలా వరకుఆన్‌లైన్‌లో లావాదేవీలు జరుగుతున్నాయి.గతంలో చాలా మంది బెట్టింగ్‌మోజులోపడి ఆర్థికంగాచితికిపోయి కుటుంబాలను నాశనంచేసుకున్నవారున్నారు.

12 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ప్యాపిలి: స్థానిక కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12వ తేదీ గణపతి పూజ, స్వస్తివాచనం, కలశ స్థాపన, 13న లలితా సహ స్రనామం, దుర్గా హోమం, లఘు పూర్ణాహుతి ఉంటుందన్నారు. 14న చండీ పారాయణం, చండీ హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పక్కాగృహాల లబ్ధిదారులకు అదనపు సాయం



నాయీ బ్రాహ్మణ కాలనీని సందర్శించిన అధికారులు

డోన్: అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కా గృహాలను లబ్ధిదారులు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందజేస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లోని నాయీ బ్రాహ్మణ కాలనీని గురువారం ఆయన సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు రూ. 50 వేలు అదనంగా సాయం అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ డీఈ వీరేంద్ర, మున్సిపల్ డీఈ, ఏఈలు ఉన్నారు.

కొలతల్లో తేడా వస్తే కఠిన చర్యలు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

డోన్ టౌన్: తూకాలు, కొలతల్లో వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుస్సేన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఆధునిక కూరగాయల మార్కెట్‌ను వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాపారులు నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ప్రజలను మోసం చేస్తే జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. ఏదైనా వస్తువును కొనేముందు ధర, తయారీ తేదీ తదితర అన్ని విషయాలను గమనించాలన్నారు. గ్యారెంటీ, వారంటీ కార్డులతో పాటు రసీదును తప్పక తీసుకోవాలన్నారు. ఏవైనా లోపాలు తలెత్తితే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని సూచించారు.

'సాక్షి' ఎడిటర్‌పై కక్ష సాధింపు తగదు



బనగానపల్లె: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విజయవాడలోని ఆయన ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్, జర్నలిస్టు సంఘాలు, వివిధ పత్రికల విలేకరులు తప్పుపట్టారు. ఏపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో విలేకరులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ నినదించారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని, సాక్షిపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అనంతరం ఆయా మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. బనగానపల్లెలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు గుండం సర్వేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జర్నలిస్టులు నరసింహారెడ్డి, చంద్రశేఖర్, బాలచెన్నయ్య, షాషావలి, మధు, కోవెలకుంట్లలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, జర్నలిస్టులు మౌలాలి, ఉసేనప్ప, సుధాకర్, మహేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, అవుకులో శ్రీనివాసులు, కంబిరెడ్డి, మధు, సురేష్, సంజామలలో విలేకరులు ఖాసీం సాహెబ్, నాగేంద్ర, మహమ్మద్ రఫీ, ముని పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



కోవెలకుంట్లలో ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తూ..



అవుకులో..



సంజామలలో..

శుభకార్యం

డోన్: మండలంలోని జగదుర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆచారి కుమారుని వివాహానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. గురువారం పట్టణంలోని న్యూమధు ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు ఉన్నారు.

మాక్‌డ్రిల్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు, పట్టణ ప్రజలకు మాక్‌డ్రిల్‌పై మెడికల్ ఆఫీసర్ సాగరిక గురువారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా 'విపత్కర పరిస్థితులు, యుద్ధం వస్తే' అనే అంశంపై ప్రజలకు వివరించారు. ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. మాక్‌డ్రిల్ అనేది ఉగ్రదాడులు, ప్రకృతి వైపరీత్యాలు, సామూహిక ప్రమాదాల వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతో పాటు సమీప ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్య, ఆరోగ్యశాఖ, ఉపాధి హామీ, ఐసీడీఎస్, ఉద్యాన శాఖ అధికారులు తమ నివేదికలను వినిపించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఈనెల 20వ తేదీ తరువాత రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తారని, రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. మండలానికి అంబేద్కర్ గురుకుల పాఠశాల మంజూరైందని, అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎంఈఓ సోమశేఖర్ తహసీల్దార్ ప్రకాశ్‌బాబును కోరారు. అందరూ బాధ్యతగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ అన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజినీర్లు మహేష్, రాజశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు రంగస్వామి, వెంకట సుబ్బమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాసవీమాత గ్రామోత్సవం



పుష్పాలంకరణలో వాసవీమాత

బేతంచెర్ల: వాసవీమాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై అమ్మవారిని కొలువుంచారు. కోలాటం, వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు సాగింది. ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా గోపాలు, జనార్దన్, శేషా మోహన్, విష్ణు, సుధీర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలోని గ్రామాల్లో నాటుసారా విక్రయాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి గురువారం తెలిపారు. బనగానపల్లె కొండపేటకు చెందిన ఎం.నాగలక్ష్మి, మల్లికార్జున నుంచి 10 లీటర్ల సారా, అలాగే నందవరం గ్రామానికి చెందిన పాణ్యం చెన్నకేశవరెడ్డి, బాలవెంకటేశ్వర్లు నుంచి రెండు కేసుల్లో కర్ణాటకకు చెందిన 48 టెట్రా ప్యాకెట్లు, 12 బాటిళ్ల (750 ఎంఎల్) బ్రాందీ బాటిళ్లు, కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామానికి చెందిన హనుమాన్‌నాయక్ నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



కర్ణాటక మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ, పోలీసులు

పనిచేయని ఫ్యాన్లు.. ఉక్కపోతతో ప్రయాణికులు



ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేయని సీలింగ్ ఫ్యాన్లు

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణను గాలి కొదిలేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గం కేంద్రమైన ఈ బస్టాండ్‌కు బనగానపల్లె, అవుకు మండలాల నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 6 గంటల నుంచే ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటుంది. ఇక్కడి నుంచి కర్నూలు, నంద్యాల, తాడిపత్రి, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలకు నిత్యం ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు నడుస్తున్నాయి. అయితే బస్టాండ్‌లో ఉన్న ఏడు సీలింగ్ ఫ్యాన్లలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. అవి కూడా అంతంత మాత్రంగానే తిరుగుతున్నాయి. మిగిలిన మూడు ఫ్యాన్లు పనిచేయడం లేదు. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. అలాగే బస్టాండ్ ప్రాంగణం, మార్గాల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో కంపు కొడుతోంది. ముక్కు మూసుకుని బస్టాండ్‌లోకి రావాల్సిన పరిస్థితి. దీనిపై ఆర్టీసీ డీఎం రవికిశోర్‌ను వివరణ కోరగా.. ఆర్టీసీ బస్టాండ్‌లో అన్ని సీలింగ్ ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయిస్తామని చెప్పారు.

నలుగురిపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన ఆలమూరు గోపి అనే వ్యక్తిపై అదే కాలనీకి చెందిన గూటం సాయి, శివ, మహేష్, మధు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. విచారణ చేస్తున్నామని చెప్పారు.